ఇక్రిశాట్ నూతన డైరెక్టర్‌గా రామ్‌కుమార్ రామస్వామి

హైదరాబాద్ సిటీ బ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ఇక్రిశాట్ డైరెక్టర్‌గా రామ్‌కుమార్ రామస్వామి నియమితులయ్యారు. గతంలో పలు కార్పొరేట్ కంపెనీలకు ఫైనాన్స్ విభాగంలో సేవలు అందించిన రామ్‌కుమార్ రామస్వామి.. 25 ఏండ్ల సుదీర్ఘ కార్పొరేట్ అనుభవంతో ఇక్రిశాట్‌లో చేరారు.

బయోమెడికల్ రంగం కోసం థిన్ స్క్రీన్స్

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): బయోమెడికల్ రంగం భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే అతి పల్చని పొరలను (థిన్ స్క్రీన్స్‌ను) ఐఐసీటీ ఆవిష్కరించింది. అడ్వాన్స్‌డ్ కొల్లాయిడ్ ఇంటర్‌ఫేస్ సైన్స్ ఆధారంగా డాక్టర్ ఉజ్వల్ పాల్ నేతృత్వంలోని ఐఐటీ పరిశోధకుల బృందం వీటిని అభివృద్ధి చేసింది.

బడిబాట వాయిదా..!

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): సోమవారం నుంచి ప్రారంభంకావాల్సి ఉన్న బడిబాట వాయిదాపడింది. డీఈవోలు ఎంఈవోలు, టీచర్లకు బడిబాట వాయిదాపడిందని ఆదివారం వాట్సాప్ సందేశాలు పంపించారు. కొత్త షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని సందేశంలో పేర్కొన్నారు. అధికారిక సమాచారం ప్రకారం ఈ నెల 10 నుంచి 25వరకు నిర్వహించే అవకాశాలున్నాయి.

నేడు పాలిసెట్ ఫలితాలు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): పాలిసెట్ ప్రవేశ పరీక్ష ఫలితాలు సోమవారం విడుదలకానున్నాయి. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం మధ్యాహ్నం 12 గంటలకు ఫలితాలు విడుదల చేస్తారు. ఫలితాల కోసం https://sbtet.telangana.gov.inను సంప్రదించవచ్చు.

ముగిసిన టెట్ పరీక్షలు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ ఉద్యోగులకు నిర్వహించిన టెట్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. మే 20 నుంచి వరుసగా ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహించారు.

కేజీఎఫ్ తరహాలో చెరువు మట్టి రవాణా

- పెద్దపల్లి జిల్లాలో అక్రమ తవ్వకం
- మట్టి మాఫియా ఇష్టారాజ్యం
- మూర్‌మూరు, ఈసాలతక్కళ్ల పల్లితో పాటు అనేక చెరువుల్లోని బంకమట్టి తరలింపు
- ఇటుక బట్టీలకు రవాణా
- నిత్యం వందల టిప్పర్లు, ట్రాక్టర్లతో తరలింపు
- ప్రభుత్వ ఆదాయానికి గండి

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలం మూర్‌మూరు చెరువులో ఇష్టారాజ్యంగా మట్టి తీసి టిప్పర్లలో నింపుతున్న భారీ ప్రొక్లెయినర్

పెద్దపల్లి, జూన్ 2 (నమస్తే తెలంగాణ): పెద్దపల్లి జిల్లాలోని చెరువులను మట్టి మాఫియా చెరబట్టింది. నల్ల ఒండ్రుమట్టిని పగలూ రాత్రి తేడా లేకుండా తరలిస్తున్నారు. ఒక్క ఇటుక బట్టీ పేరిట అనుమతి తీసుకొని, పదుల సంఖ్యలో బట్టీలకు తరలించుకుపోతున్నారు. అధికారులకు చిక్కకుండా మట్టిని ఒక చోట లోడింగ్ చేసి, కొలతలకు చిక్కకుండా చదును చేసి కుప్పలను నేలకు సమానంగా చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు అటు వైపు కన్నెత్తి చూడకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

జిల్లాలో 180 వరకు ఇటుక బట్టీలు

జిల్లాలోని పెద్దపల్లి, సుల్తానాబాద్, కమాన్‌పూర్, రామగిరి, ధర్మారం, మంథని మండలాల్లో 180కి పైగా ఇటుక బట్టీలు ఉన్నాయి. హైదరాబాద్‌తోపాటు కరీంనగర్, వరంగల్, ఖమ్మం, తదితర నగరాలకు ఇక్కడి నుంచే ఇటుకలు సరఫరా అవుతాయి. వీటి తయారీకి చెరువు ఒండ్రు మట్టితోపాటు ఫ్లైయాష్ వాడుతారు. పదేండ్లుగా అన్ని చెరువుల్లో నీళ్లు ఉండగా, ఈ సారి వేసవిలోనే నీళ్లు లేక అనేక చెరువులు ఎండిపోయాయి. దీంతో ప్రైవేటు, ఇటుక బట్టీల వ్యాపారులు స్థానిక నాయకులను, అధికారులను మచ్చిక చేసుకొని మట్టిని బట్టీలకు తరలిస్తున్నారు. తక్కువ మొత్తంలో సీనరేజ్ సొమ్ము చెల్లించి పెద్దమొత్తంలో మట్టిని తరలిస్తున్నారు.

మట్టి క్వారీలు సీజ్

కమాన్‌పూర్ మండలం జూలపల్లి పెద్దచెరువులోని మట్టిని తరలించేందుకు గౌరెడ్డిపేటకు చెందిన ఇటుక బట్టి యజమాని మొదట 4 వేల క్యూబిక్ మీటర్లకు, ఆ తర్వాత 2 వేల క్యూబిక్ మీటర్లకు రూ.3.84 లక్షల సీనరేజీ సొమ్ము చెల్లించారు. కానీ, ఈ చెరువు నుంచి 12 వేల నుంచి 15 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించాడనే ఆరోపణలున్నాయి. సుల్తానాబాద్ మండలం మియాపూర్‌కు చెందిన వ్యక్తి రామగుండం మండలం అల్లూరు చెరువు నుంచి 2 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించుకునేందుకు రూ.1,28,000 సీనరేజ్ సొమ్ము చెల్లించాడు. కానీ, 8 వేల నుంచి 10 వేల క్యూబిక్ మీటర్ల మట్టిని తరలించాడు. దీంతో అధికారులు ఆ క్వారీని సీజ్ చేశారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని మల్లికార్జున బ్రిక్స్ కంపెనీ అల్లూరు చెరువులో 2 వేల మెట్రిక్ టన్నుల మట్టికి అనుమతి తీసుకుని, నిబంధనలకు విరుద్ధంగా మట్టిని తరలించడంతో తహసీల్దార్ కుమారస్వామి అల్లూరు చెరువును పరిశీలించారు. భారీ యంత్రాలు, టిప్పర్లు ఉండటంతో వాటిని సీజ్ చేసి, నిర్వాహకులపై కేసు నమోదు చేశారు. మంథని మండలం బిట్టుపల్లి చెరువులో మట్టి తవ్వకాలపై ఫిర్యాదులు రావడంతో పనులు నిలిపివేశారు. గుంజపడుగుకు చెందిన అక్షయ్ బ్రిక్స్, మరో 7 సంస్థలు బిట్టుపల్లి పెద్ద చెరువు నుంచి ఇటుక బట్టీల కోసం 80 వేల మెట్రిక్ టన్నుల మట్టి కోసం దరఖాస్తు చేసుకున్నాయి. 10 వేల మెట్రిక్ టన్నుల మట్టికి సీనరేజ్ చెల్లించి, ఎక్కువ లోతు మట్టి తవ్వడంతో ఇరిగేషన్ అధికారులు ఈ నెల 26 నుంచి 31 వరకు ఇచ్చిన తాత్కాలిక అనుమతులు రద్దు చేశారు.

మూర్‌మూరులో మట్టితీత

అంతర్గాం మండలం మూర్‌మూరు చెరువులోని మట్టిని టిప్పర్ల ద్వారా మరో చోట డంప్ చేస్తున్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌కు చెందిన ఎస్‌హెచ్‌ఆర్ బ్రిక్స్‌కు చెందిన ఏ శ్రీనివాస్ 3000 మెట్రిక్ టన్నులకు గత నెల 22 నుంచి ఈ నెల 5 వరకు మట్టితీతకు అనుమతి ఇచ్చారు. 25వ తేదీ వరకే 3 వేల మెట్రిక్ టన్నులు తవ్వినట్టు గుర్తించి మట్టితీతను నిలిపివేయాలని ఇరిగేషన్ డీఈ ఆదేశించారు. ఏఎస్‌ఆర్ బ్రిక్స్‌కు సైతం 14,500 మెట్రిక్ టన్నుల మట్టి తరలించేందుకు రూ.5.30 లక్షల వరకు చెల్లించి అనుమతి తీసుకున్నారు. ఎలాంటి రక్షణ చర్యలూ చేపట్టకుండా పగలూ రాత్రి మట్టి తవ్వకాలను చేపడుతూ సమీపంలోనే డంప్ చేస్తున్నారు.

అనుమతులు లేకుండానే మట్టితీత

పెద్దపల్లి మండలం రాఘవాపూర్, రంగాపూర్, గౌరెడ్డిపేట, భోజన్నపేట, తుర్కల మద్దికుంటతోపాటు జిల్లాలోని మంథని, కమాన్‌పూర్, ముత్తారం, ధర్మారం, శ్రీరాంపూర్, సుల్తానాబాద్, ఎలిగేడు మండలాల్లో అనుమతులు లేకుండానే మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. వీటిపై అధికారులు స్పందిస్తున్నా.. ప్రజా ప్రతినిధుల ప్రమేయం ఉండడంతో ఏమీ చేయలేకపోతున్నారు.

50 వాహనాల వరకూ సీజ్

మట్టిని తరలిస్తున్న దాదాపుగా 50 వాహనాలను అధికారులు సీజ్ చేశారు. పెద్దపల్లి, కమాన్‌పూర్, రామగిరి, మంథని మండలాల్లో వాహనాలను సీజ్ చేసి వాటిని పోలీసు స్టేషన్లకు తరలించారు. సీజ్ చేసిన వాహనాలను వదిలి పెట్టాలని అధికారులపై ప్రజా ప్రతినిధులు ఒత్తిడి చేస్తున్నట్టు తెలుస్తున్నది.

నల్లగొండ జిల్లాలో ఆగని మట్టిదందా

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం అయిటిపాముల రిజర్వాయర్‌లోనూ నెల రోజులుగా ఒండ్రు మట్టి దందా కొనసాగుతున్నది. ఇటుక బట్టీల వ్యాపారి ఇరిగేషన్‌శాఖకు నామమాత్రం గా రూ.4.15 లక్షలు సీవరేజీగా చెల్లించి, అనుమతికి మూడింతలు అదనంగా బం కమట్టిని తరలించాడు. నిబంధనలకు విరుద్ధంగా చెరువు కట్టవరకు పదిఫీట్ల లోతు వరకు 10-15 రోజులు తవ్వి తీసుకెళ్లాడు. ఇదే అదనుగా మరి కొందరు ఇటుక బట్టీల వ్యాపారులు అనుమతులు లేకుండా ఎమ్మెల్యే భరోసాతో అక్రమంగా ఆదివారం వరకు కూడా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఫ్రీలాంచ్‌లో విల్లాలంటూ మోసం

- రూ.1.4 కోట్లు వసూలు చేసిన ఈవీకే ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్
- బాధితుల ఫిర్యాదు.. కేసు నమోదు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): ఫ్రీ లాంచ్ ఆఫర్‌లో శంకర్‌పల్లిలో తక్కువ ధరకు విల్లా అంటూ నమ్మించి ఇద్దరిని నుంచి ఓ రియల్ ఎస్టేట్ సంస్థ రూ.1.4 కోట్లు టోకరా వేసింది. బాధితులు నెల క్రితం జూబ్లీహిల్స్ పీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో అక్కడ నమోదైన కేసు తాజాగా సీసీఎస్‌కు బదిలీ అయ్యింది. నారాయణగూడకు చెందిన కే రాఘవేంద్ర ఇల్లు, విల్లా కొనాలనే ఉద్దేశంతో ఆన్‌లైన్‌లో ఈవీకే ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో వచ్చిన ప్రకటనలు చూశాడు. జూబ్లీహిల్స్‌లోని ఆ సంస్థ కార్యాలయానికి వెళ్లి వివరాలు తెలుసుకున్నాడు. ఈవీకే ప్రాజెక్ట్స్ శంకర్‌పల్లి మొకిలలో ఈవీకే-శ్రీ శిల్పా పేరుతో విల్లాలు నిర్మిస్తుందని, తక్కువ ధరకు ఇస్తామంటూ నమ్మించారు. శంకర్‌పల్లికి తీసికెళ్లి అక్కడ ఒక స్థలాన్ని చూపించి ఇక్కడే విల్లాల నిర్మాణం జరుగుతుందని నమ్మించారు. వారి మాటలను నమ్మిన రాఘవేంద్ర, మరో వ్యక్తి అనిల్ ఎస్ఎఫ్టీ రూ.4,500 చొప్పున కొనుగోలుకు ఒప్పందం చేసుకున్నారు. బాధితులిద్దరు అడ్వాన్స్‌గా ఒక్కొక్కరు రూ.70 లక్షల చొప్పున రూ.1.4 కోట్లు సంస్థ నిర్వాహకులకు చెల్లించారు. ఇంటి నిర్మాణం జరుగుతుందని త్వరలోనే కొత్త ఇంట్లోకి వెళ్తామనే ఆలోచనలో బాధితులన్నారు. ఒక రోజు ఫ్యామిలీ ఫంక్షన్ ఉండటంతో రాఘవేందర్, అనిల్ కుటుంబసభ్యులతో కలిసి విల్లా నిర్మాణం జరుగుతుందని భావిస్తున్న మొకిలకు వెళ్లారు. అక్కడ ఎలాంటి నిర్మాణం లేకపోవడంతో కంగుతిన్నారు. తిరిగి జూబ్లీహిల్స్‌లోని కార్యాలయానికి వచ్చి జరిగిన మోసంపై నిలదీశారు. అక్కడ కొంత నష్టం వచ్చిందని, ఆరు నెలల్లో మీ డబ్బులు తిరిగి చెల్లిస్తామంటూ చెప్పారు. రేపు, మాపు అంటూ.. కాలయాపన చేయడంతోపాటు డబ్బులు ఇవ్వబోమని, ఏమి చేసుకుంటారో సంస్థ నిర్వాహకులు బెదిరింపులకు దిగడంతో బాధితులు జూబ్లీహిల్స్‌లో ఠాణాలో ఫిర్యాదు చేశారు. దాంతో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గుంటుపల్లి శ్రీనివాస్‌రావు, డైరెక్టర్లు గుంటుపల్లి పద్మజ, వంశీకృష్ణ చౌదరి ఇదర, అనుష గుంటుపల్లి, గుంటుపల్లి సమంతపై కేసు నమోదు చేశారు. ఈ కేసు సీసీఎస్‌కు బదిలీ కావడంతో తాజాగా సీసీఎస్‌లో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఐటీ ఉద్యోగుల మెడపై ఏఐ కత్తి

- ఏఐ టెక్నాలజీలో అప్‌డేట్ లేకుంటే లేఆఫ్‌కు సిద్ధంగా ఉండాల్సిందే
- ఉద్యోగులకు కంపెనీల స్పష్టీకరణ
- సైలెంట్‌గా కొనసాగుతున్న లేఆఫ్‌లు

హైదరాబాద్ సిటీబ్యూరో, జూన్ 2 (నమస్తే తెలంగాణ): కృత్రిమ మేధ (ఏఐ)లో నైపుణ్యం లేక ఎంతో మంది లేఆఫ్‌ల బారి న పడుతున్నారు. జావా, డాట్ నెట్, సీ, సీ++.. ఇలా ఎన్ని ప్రోగ్రామింగ్ ల్యాంగేజీల్లో అనుభవం ఉన్నా ఏఐలో నైపుణ్యం లేకుంటే ఉద్యోగావకాశం లేనట్టే. ఏఐ నైపు ణ్యం లేదని దేశవ్యాప్తంగా వేల మంది ని ఐటీ కంపెనీలు ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నాయి. 'ప్రాజెక్టులు లేవు.. పనితీరు సరిగ్గా లేదు' అంటూ సైలెంట్ లేఆఫ్స్ చేపడుతున్నాయి. 3 నెలల్లో 10 వేల మంది ఉద్యోగాలు కోల్పోగా, హైదరాబాద్‌లోనే 4,500 మంది ఉద్యోగాలు కోల్పోయారని ఐటీ ఇండస్ట్రీ నిపుణులు పేర్కొంటున్నారు.

ఏఐ నైపుణ్యంతోనే ఉద్యోగ భద్రత

ఐటీ రంగంలో ఏఐ వినియోగం గణనీయంగా పెరిగింది. మనుషులు చేయాల్సిన పనులు మొత్తం ఏఐ టూల్స్ చేస్తున్నాయి. దీంతో కంపెనీలు తమ ప్రొడక్షన్ కాస్ట్‌ను తగ్గించుకోవడంలో భాగంగా ఉద్యోగులను తొలగిస్తున్నాయి.

ఏఐ టూల్స్‌తో కానిచ్చేస్తున్నారు

ప్రస్తుతం వందల సంఖ్యలో ఏఐ టూల్స్ అందుబాటులో ఉన్నాయి. అప్లికేషన్ వినియోగానికి నెలకు, ఏడాదికి కొంత చెల్లించి ఏఐ టూల్స్‌ను ఎవరైనా వినియోగించుకోవచ్చు. ఏడాదిన్నర క్రితం వచ్చిన చాట్‌జీపీటీతో ఏఐ వినియోగం తారాస్థాయికి చేరింది. ఇమేజ్, కోడ్, వీడియో, స్పీచ్, 3డీ, రిసెర్చ్ సంబంధించిన పనులు చేసే ఏఐ టూల్స్ పదుల సంఖ్యలో అందుబాటులో ఉన్నాయి.

ఎంజేపీ విద్యార్థులకు 'స్పెషల్ జ్యూరీ'

హైదరాబాద్, మే2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో భాగంగా పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల విద్యార్థులను స్పెషల్ జ్యూరీ అవార్డు వరించింది. సొసైటీ కార్యదర్శి బడుగు సైదులుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అవార్డును అందజేశారు. నాగార్జునసాగర్, కొలిముంతలపాడు, కమలాపూర్ మహాత్మ జ్యోతిబాపూలే గురుకులాలకు చెందిన 70మంది విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్‌లో పాల్గొన్నారు. తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో మార్చ్‌ఫాస్ట్ బృందానికి కెప్టెన్‌గా వ్యవహరించిన చందును ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. స్పెషల్ జ్యూరీ అవార్డు అందుకున్న విద్యార్థులను బీసీ వెల్ఫేర్ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్రా వెంకటేశం అభినందించారు. వేడుకల్లో ఎంజేపీ సొసైటీ ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాస్‌రావు, భాస్కర్, రామయ్య, సొసైటీ జాయింట్ సెక్రటరీ తిరుపతి, పర్యవేక్షకుడు కేశవులు పాల్గొన్నారు.

నేడు 'మేడిగడ్డ'కు నిపుణుల బృందాలు

హైదరాబాద్, జూన్ 2 (నమస్తే తెలంగాణ): మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల అధ్యయనానికి సీఎస్ఎంఆర్ఎస్ (సెంట్రల్ సాయిల్ అండ్ మెటీరియల్ రీసెర్చ్ స్టేషన్), సీడబ్ల్యూపీఆర్ఎస్ (సెంట్రల్ వాటర్ అండ్ పవర్ రీసెర్చ్ స్టేషన్) నిపుణుల బృందాలు సోమవారం రానున్నాయి. ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సిఫారసుల మేరకు ఆయా బరాజ్‌ల పనితీరు, లోపాలపై స్టడీ చేయనున్నాయి. ఎన్‌డీఎస్‌ఏ కమిటీ సూచన మేరకు మేడిగడ్డ (లక్ష్మీ) బరాజ్ 7వ బ్లాక్‌లోని 20వ పిల్లర్ కుంగుబాటు, అన్నారం (పార్వతీ), సుందిళ్ల (సరస్వతీ) బరాజ్‌లో సీపేజీలపై ఆ రెండు సంస్థలతో సాంకేతిక అధ్యయనం చేయించాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ఆ మేర కు నిధులు కేటాయించింది. ప్రధానంగా బ రాజ్‌లకు సంబంధించి ఎగువ, దిగువన ఉన్న సెకెంట్ ఫైల్స్ పరిస్థితి, పారామెట్రిక్ జా యింట్లు, జియోఫిజికల్, జియోటెక్నికల్ పరీక్షలు నిర్వహించి, ప్రస్తుతం కొనసాగుతున్న గ్రౌటింగ్ పనులను పరిశీలించనున్నాయి.

రాబడి

మీ వాహనానికి థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ ఉందా?



దేశంలో వాహనదారులకు మోటార్ బీమా తప్పనిసరి. మీకు కారున్నా.. బైకున్నా.. లేదా మరే వాహనం ఉన్నా.. వెహికిల్ ఇన్సూరెన్స్ నుంచి మాత్రం తప్పించుకోలేరు. ఇది మోటార్ వెహికిల్స్ యాక్ట్ 1988 నిబంధన. కాబట్టి ప్రతీ వాహనదారునికి మోటార్ ఇన్సూరెన్స్‌పై అవగాహన ఉండాల్సిందే. అయితే చాలామంది మొక్కుబడిగా ఏదో ఓ ఇన్సూరెన్స్‌ను తీసుకుని సరిపెట్టుకుంటున్నారు. ట్రాఫిక్ చలాన్ల నుంచి బయటపడితే చాలన్నట్టు వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను తీసుకునేందుకు పెద్దగా ఎవరూ ఆసక్తి కనబర్చడం లేదు. ఈ రకమైన వైఖరి చాలాచాలా నష్టపరుస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

సమగ్ర పాలసీ అవసరం

కార్ ఇన్సూరెన్సైనా, బైక్ ఇన్సూరెన్సైనా సమగ్ర రీతిలో ఉండాలి. మీరు తీసుకున్న వెహికిల్ ఇన్సూరెన్స్ మీ వాహనానికి ఓ భద్రతా వలయంలా రక్షణని వ్వాలి. కేవలం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్‌పైనే దృష్టి పెట్టకూడదు. ఉదాహరణకు ఒకవేళ మీ ఇంటి బయట పార్క్ చేసిన కారుపై దగ్గర్లోని ఓ చెట్టు కొమ్మ విరిగిపడింది. దీని వల్ల కారుకు బాగానే నష్టం వాటిల్లింది. లేదా ఉదయం లేచిచూసేసరికి మీ అపార్ట్‌మెంట్ అవతలనున్న మీ బైక్‌ను దొంగిలించారు. ఇలాంటి సందర్భాల్లో మీరు తీసుకునే బీమానే మీకు రక్ష. అలాగే వరదలు, భూకంపాల వంటి ప్రకృతి విపత్తులు, అల్లర్ల వంటి వాటిలో నష్టం జరిగినా వాహన బీమా వర్తిస్తుందన్నది మరువద్దు. కాబట్టి అన్ని కోణాల్లో ఆలోచించి, ఆరా తీసి ఓ సమగ్ర పాలసీని తీసుకోవాలి.

పాలసీ కొనుగోలులో ఈ పొరబాట్లు వద్దు

- మీ ప్రాధాన్యతలను గుర్తించకపోవడం
- అసంపూర్ణ కవరేజీతో కూడిన పాలసీలు
- యాడ్-ఆన్ కవరేజీని నిర్లక్ష్యం చేయడం
- వివిధ పాలసీలు, వాటి ప్రీమియంలను పరిశీలించకపోవడం
- నో క్లెయిమ్ బోనస్‌లను పట్టించుకోకపోవడం



థర్డ్-పార్టీ బీమా అంటే?

కార్ ఇన్సూరెన్స్, బైక్ ఇన్సూరెన్స్‌ల్లో థర్డ్-పార్టీ బీమా చాలా ముఖ్యమైనది. మోటార్ ఇన్సూరెన్స్‌లో ఫస్ట్-పార్టీ వాహన యాజమాని (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు). సెకండ్-పార్టీ ఇన్సూరెన్స్‌ను అమ్మినవారు (బీమా సంస్థ). థర్డ్-పార్టీ ఏదైనా ప్రమాదంలో మీ వాహనం వల్ల నష్టపోయినవారు, గాయాలపాలైనవారు, చనిపోయినవారు. చికిత్సకు వైద్య ఖర్చులు, ఆస్తి నష్టానికి నగదును ఈ కవరేజీలో బీమా సంస్థనే అందిస్తుంది. థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ లేకపోతే ఈ ఖర్చులన్నీ వాహనదారుడి నెత్తిపైనే పడుతాయి. కనుక తప్పకుండా అత్యుత్తమ బీమాను తీసుకోవాలి. గడువు దాటకముందే రెన్యువల్స్ చేస్తూపోవాలి. అయితే ప్రమాదంలో మీకు (ఇన్సూరెన్స్‌ను కొన్నవారు), మీ వాహనానికి జరిగిన నష్టం మాత్రం థర్డ్-పార్టీ ఇన్సూరెన్స్ పరిధిలోకి రాదు.

ఇది గుర్తుంచుకోండి..

సరైన వాహన బీమా పాలసీని తీసుకోవడం వల్ల మీ కారు, బైక్‌లకే కాదు.. మీకూ అనేక లాభాలుంటాయి. కాబట్టి మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వివిధ రకాల మోటార్ ఇన్సూరెన్స్‌లను క్షుణ్ణంగా పరిశీలించి ఓ నిర్ణయానికి రావాలి. ఈ క్రమంలో క్యాష్‌లెస్ గ్యారేజ్ నెట్‌వర్క్స్, ప్రీమియం ధరలు, యాడ్-ఆన్ ఫీచర్లు, బీమా సంస్థకున్న విశ్వసనీయత, కవరేజీ వంటి వాటిని ప్రధానంగా పరిగణనలోకి తీసుకోవాలి. కాగా, మెకానికల్ లేదా ఎలక్ట్రికల్ బ్రేక్‌డౌన్ జరగడం, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండానే వాహనం నడిపి ప్రమాదాలకు గురికావడం, మద్యం సేవించి వాహనాలు నడుపడం వంటి నిబంధనల ఉల్లంఘనల్లో కవరేజీలు వర్తించవు.

దీర్ఘకాలిక పెట్టుబడులే మేలు

స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌పై నిపుణుల సలహా

దేశీయ స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే మదుపరులు.. దీర్ఘకాలిక పెట్టుబడులపై దృష్టి సారించాలని మెజారిటీ నిపుణులు సూచిస్తున్నారు. ఇటీవలే మునుపెన్నడూ లేనివిధంగా బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 76,000 మార్కును, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 23,100 స్థాయిని తాకిన విషయం తెలిసిందే. దీంతో ఈ ర్యాలీ వెనుక ఆకర్షణీయమైన కార్పొరేట్ త్రైమాసిక ఫలితాలు, బలమైన ఆర్థికాంశాలున్నాయని ఎక్స్‌పర్ట్స్ విశ్లేషిస్తున్నారు. ఈ క్రమంలోనే రిటైల్ ఇన్వెస్టర్లు.. క్వాలిటీ స్టాక్స్‌ను కొనేందుకున్న అవకాశాలను పరిశీలించాల్సిందిగా సలహా ఇస్తున్నారు. కార్పొరేట్ బ్యాలెన్స్ షీట్లు ఐదేండ్ల క్రితంతో పోల్చితే క్లీన్‌గా ఉన్నాయని, విస్తరణకు వీలు కూడా ఉందంటున్న విశ్లేషకులు.. ఈ కంపెనీల షేర్లలో పెట్టుబడులకు ఇదే సరైన సమయమని కూడా చెప్తున్నారు. కాగా, ఎన్నికలు, ఫలితాల దృష్ట్యా కొద్ది రోజుల వరకు మార్కెట్లలో ఒడిదొడుకులు తప్పవని కూడా పేర్కొంటున్నారు.

ఈ రంగాల్లో..

ఆటోమోటివ్, రియల్టీ, క్యాపిటల్ గూడ్స్, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, కన్స్యూమర్ డిస్క్రీషియనరీ షేర్లు ఆకర్షణీయంగా ఉన్నాయి. బ్యాంకింగ్, ఫైనాన్షియల్స్, ఎఫ్ఎంసీజీ, ఐటీ, కెమికల్స్ రంగాల షేర్లలోనూ పెట్టుబడులకు వీలున్నది. కాబట్టి ఇన్వెస్టర్లు తమ ఆర్థిక లక్ష్యాలకు, అందుబాటులో ఉన్న నగదు నిల్వలకు, రిస్క్‌ను భరించే స్థాయికి అనుగుణంగా పెట్టుబడులకు వెళ్లవచ్చు. నిజానికి ఈ ఏడాదిలో ఇప్పటిదాకా బీఎస్ఈ సెన్సెక్స్ 4 శాతం వరకు పుంజుకున్నది. భారతీయ ఈక్విటీల్లో నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరులు (ఎఫ్‌పీఐ) తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నా సూచీలు రికార్డు గరిష్ఠాలకు చేరడం కలిసొచ్చే అంశమేనని చెప్పవచ్చు. ఈ ఏడాదిలో ఇప్పటిదాకా ఎఫ్‌పీఐలు దాదాపు రూ.21,000 కోట్ల పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు మరి.

కంపెనీలు తమ త్రైమాసిక ఆర్థిక ఫలితాలను ప్రకటిస్తున్నాయి. చాలా సంస్థలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. రిటైల్ ఇన్వెస్టర్లు దీర్ఘకాలిక పెట్టుబడులకే వెళ్లాలి. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్)ను పరిశీలించవచ్చు. అవకాశాలను సద్వినియోగం చేసుకుని లాభాలను ఆర్జించవచ్చు.

-తేజస్ ఖోడే, ఫీర్స్ వ్యవస్థాపక సీఈవో

స్టాక్ మార్కెట్లు పెరగడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయి. కనుక ఇది నిలకడైన ర్యాలీగానే చెప్పుకోవచ్చు. మున్ముందు సూచీలు మరింతగా పెరిగే వీలుందనే అనుకుంటున్నా. కాబట్టి దీర్ఘకాలిక పెట్టుబడులకు అనువుగానే భావించవచ్చు. ఇక ఈక్విటీల్లో రిటైల్ ఇన్వెస్టర్ల భాగస్వామ్యం తక్కువగా ఉన్నది. ఇంకా పెరగాలి.

-ఉపాసన భరద్వాజ్, కొటక్ మహీంద్రా బ్యాంక్ ప్రధాన ఆర్థికవేత్త

పోర్ట్‌ఫోలియోల్లో వైవిధ్యం, బలమైన మూలాలున్న క్వాలిటీ స్టాక్స్‌లో పెట్టుబడులు, ఊహాజనిత ట్రేడింగ్‌కు దూరంగా ఉండటం వల్ల స్టాక్ మార్కెట్ రిస్క్‌లను మదుపరులు అధిగమించవచ్చు. ముఖ్యంగా స్వల్పకాలిక పెట్టుబడులకు వెళ్లకుండా కనీసం 2-3 ఏండ్లైనా దీర్ఘకాలిక పెట్టుబడులకు వెళ్లాలి.

-వినాయక్ మెహెతా, ఇన్ఫినిటీ గ్రూప్ వ్యవస్థాపక డైరెక్టర్

నెలకు 2 లక్షల పెన్షన్ కావాలా?

ఎన్‌పీఎస్ రిటైర్మెంట్ ప్లాన్ తెలుసుకోండిలా..

ప్రస్తుతం మీ వయసు 30 ఏండ్లైతే.. మీ పదవీ విరమణ అనంతరం నెలకు రూ.2 లక్షల పెన్షన్ కోసం రూ.5 కోట్ల కార్పస్ ఫండ్ అవసరం.

ఇందుకు నేషనల్ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) అనువైనదిగా చెప్పవచ్చు. ఎన్‌పీఎస్ అనేది స్టాక్ మార్కెట్ లింక్డ్ స్కీమ్. ఇందులో పెట్టిన పెట్టుబడుల సగటు వార్షిక వృద్ధి ఏటా 10 శాతంగా ఉంటున్నది. అందుకే మెరుగైన మీ పెన్షన్ అవసరాలకు ఎన్‌పీఎస్ సరైనదని ఆర్థిక నిపుణులు సైతం అంటున్నారు.

నెలకు రూ.22,150

నెలనెలా దాదాపు రూ.